
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
శుక్రవారం 2 ఫిబ్రవరి 2024







పిల్లలు మారాం చేశారనో.. లేదంటే నోటికి ఏదైనా తీపిగా తినాలనిపిస్తుందనో.. చాక్లెట్లు కొనే ముందు తస్మాత్ జాగ్రత్త.. ఎందుకంటే తియ్యటి చాక్లెట్లలో మత్తుగా గంజాయి కలిపి విక్రయిస్తున్న వైనం బుధవారం చేర్యాలలో వెలుగుచూసింది. ఈ సంఘటన సిద్దిపేట జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఇంతకాలం సిగరెట్ల వరకే పరిమితమైన గంజాయి మత్తును చాక్లెట్లలోకి సర్దుబాటు చేసే తతంగాన్ని చూసి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. డ్రగ్స్, గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దుతానని కొత్త సీపీ ప్రకటించిన స్వల్ప వ్యవధిలోనే ఈ వ్యవహారం బయటపడింది. మరింత అప్రమత్తంగా ఉంటే ఇలాంటి సంఘటనలు పునరావృతం కావనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గంజాయ్..

- జిల్లాలో డ్రగ్స్ కల్చర్ జాడలు
- కిక్కెక్కిస్తున్న చాక్లెట్లు, సిగరెట్లు
- వెలుగుచూస్తున్న గంజాయి విక్రయాలు
- చేర్యాల ఘటనతో నివ్వెరబోయిన వైనం
- గతంలోనూ పలుచోట్ల గంజాయి ఆనవాళ్లు
- ఇటీవలే తీవ్రంగా హెచ్చరించిన సీపీ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 1 : రాజధాని హైదరాబాద్‌కు సమీపంలో ఉన్నందున సిద్దిపేట జిల్లాల కొంత పాశ్చాత్య సంస్కృతి అలవడుతున్నది. హైదరాబాద్‌లో తరుచుగా డ్రగ్స్, గంజాయి ముఠాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా కొంతమంది యువత ఈ డ్రగ్స్, గంజాయి కల్చర్‌కు బానిసలుగా మారుతున్నారు. ఇదే సంస్కృతి జిల్లాను సైతం తాకింది. ఇటీవల కాలంలో పలు సంఘటనలు వెలుగులోకి రావడమే ఇందుకు కారణంగా చెప్పొచ్చు.

ఆ అడ్డాల్లోనే ఆనవాళ్లు

తాజాగా చేర్యాలలోని పాన్‌షాపు కేంద్రంగా గంజాయి చాక్లెట్లు విక్రయించడం వెలుగులోకి వచ్చింది. ఇదే విధంగా జిల్లాలోని పలు పాన్‌షాపుల్లో ఈ దందా సాగుతున్నట్లు సమాచారం. ఇక యువతను టార్గెట్ చేస్తూ కాలేజీల సమీపంలో ఏర్పాటైన పాన్‌షాపులు, బేకరీలు, టీ దుకాణాల్లోనూ మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారన్న ప్రచారం జరుగుతున్నది. గంజాయి, డ్రగ్స్‌తో పాటు వైట్‌నర్, కొన్ని మత్తెక్కించే మెడిసిన్‌ను సైతం విచ్చలవిడిగా వినియోగిస్తున్నట్లు తెలుస్తున్నది. జిల్లాలో ఉపాధి కోసం వచ్చిన ఇతర రాష్ట్రాల కూలీలు, యువకులు ఈ మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారు. వందల రూపాయలు వెచ్చించి మద్యం కొనుగోలు చేయడం కంటే పదుల రూపాయల్లోనే లభ్యమయ్యే గంజాయి సిగరెట్లకు మొగ్గు చూపిస్తున్నారు.



కోహెడ మండలం చంద్రనాయక్ తండాలో తొలగించిన గంజాయి మొక్కలు(ఫైల్)

నిఘా పెంచితేనే

గంజాయి, డ్రగ్స్ విక్రయాలకు అడ్డుకట్ట వేయాలంటే ఈ దిశగా నిఘాను పెంచాల్సిన అవసరం ఉన్నది. జిల్లాలో ప్రధానంగా డ్రగ్స్, గంజాయిని ప్రబలకుండా చూస్తానని తాజాగా పోలీస్ కమిషనర్ అనురాధ స్పష్టం చేశారు. డ్రగ్స్ ఫ్రీ కమిషనరేట్‌గా తీర్చిదిద్దుతానని ఆమె చెప్పుకొచ్చారు. ఈ విషయంలో ఆమె ప్రత్యేక దృష్టి పెట్టినట్లుగా చెప్పకనే చెప్పారు. ఇంతలోనే పలు సంఘటనలు వెలుగులోకి రావడం పోలీస్ శాఖకు సవాల్ విసిరినంత పనైంది. అయితే పట్టుబడిన నేరస్థుల వాంగ్మూలాల ఆధారంగా క్షేత్రస్థాయిలో నిఘాను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇతర రాష్ట్రాల కూలీలతోపాటు పలు విద్యాసంస్థల సమీపంలో ఉన్న దుకాణాలపైనా నిఘా అవశ్యంగా కనిపిస్తున్నది.

గుప్పుమంటున్న గంజాయి

- కోహెడ మండలం ఆరెపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చంద్రనాయక్ తండాలో గల ఓ ఇంటి ఆవరణలో 26 గంజాయి మొక్కలతోపాటు 240 గ్రాములు ఎండు గంజాయి లభ్యమైంది. ఎక్సైజ్ అధికారులు గణేశ్ అనే వ్యక్తిపై కేసు సైతం నమోదు చేశారు.
- బెజ్జంకి మండలంలో గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిపై 2022లో పోలీసులు కేసు నమోదు చేశారు. వీరంతా కూడా ఇదే మండలానికి చెందినవారు.
- గత సెప్టెంబరు 12వ తేదీన గజ్వేల్ పోలీసులు ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని 21 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- చేర్యాల మండలం చుంచనకోట గ్రామశివారులో 1590 గ్రాముల గంజాయిని పోలీసులు సీజ్ చేశారు.
- సిద్దిపేటలోని నాసర్‌పుర పరిసర ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు గంజాయిని రవాణా చేస్తుండగా వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి సుమారు అరకిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- సిద్దిపేటఅర్బన్ మండలం పొన్నాలలో వ్యవసాయ బావి వద్ద గంజాయి మొక్కలు పెంచుతున్నాడని గతంలో ఓ వ్యక్తిపై కేసు నమోదైంది.
- గతంలో మద్దూరు మండలం ధర్మారంలో ఓ యువకుడు గంజాయి విక్రయిస్తుండగా టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు.



చేర్యాలలో పట్టుబడిన గంజాయి చాక్లెట్లు

బాలకార్మిక వ్యవస్థను

నిర్మూలించాలి

- ఆపరేషన్ స్మైల్-ఎక్స్‌లో 85 మంది బాల కార్మికులకు విముక్తి
- 9 మంది యజమానులపై కేసు
- సీపీ డాక్టర్ బి.అనురాధ



సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 1: సిద్దిపేట జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ అధికారులకు సూచించారు. గురువారం ఆపరేషన్ స్మైల్-ఎక్స్ పూర్తయిన సందర్భంగా సీపీ మాట్లాడారు. జనవరి 1 నుంచి 31 వరకు నిర్వహించే ఆపరేషన్ స్మైల్-ఎక్స్‌లో వివిధ డిపార్ట్‌మెంట్ల అధికారులు, సిబ్బందితో రిస్క్యూ ఆపరేషన్ చేసినట్లు చెప్పారు. రిస్క్యూ ఆపరేషన్‌లో తెలంగాణ, ఆంధ్రా, ఉత్తర్‌ప్రదేశ్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్, నేపాల్, బీహార్, కర్ణాటక, ఝూర్ఖండ్ రాష్ట్రాలకు చెందిన 85 మందిని పిల్లలను వారి తల్లిదండ్రులు, బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. వీరిలో 71 మంది బాలురు, 14 మంది బాలికలు ఉన్నట్లు పేర్కొన్నారు. బాల కార్మికులతో పనిచేయించుకుంటున్న యజమానులపై జిల్లాలో 9 కేసులు నమోదు చేశామని సీపీ వివరించారు. సిద్దిపేట డివిజన్ పరిధిలో 49 మంది బాలురు, ఏడుగురు బాలికలు, గజ్వేల్ డివిజన్ పరిధిలో 18 మంది బాలురు, ఐదుగురు బాలికలు, హుస్నాబాద్ డివిజన్ పరిధిలో నలుగురు బాలురు, ఇద్దరు బాలికలను గుర్తించినట్లు తెలిపారు. ఆపరేషన్ స్మైల్-ఎక్స్ విజయవంతం చేసిన నోడల్ అధికారి అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ మల్లారెడ్డి, వివిధ శాఖల అధికారులను ఆమె అభినందించారు.

మొగి పురుగు నివారణకు

చర్యలు తీసుకోండి

నారాయణరావుపేట, ఫిబ్రవరి 1: వరిలో వచ్చే మొగి పురుగును గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకటరమణి రైతులకు సూచించారు. గురువారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులకు మొగి పురుగు నివారణపై అవగాహన కల్పించారు. వరిలో గతేడాదితో పోల్చితే ఈసారి మొగి పురుగు తీవ్రత ఎక్కువగా ఉన్నదని తెలిపారు. రైతులు ముందే గమనించి నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈవో నాగార్జున్, క్లస్టర్ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.



గజ్వేల్ శాసనసభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం బీఆర్‌ఎస్‌ఎల్పీ నేతగా బాధ్యతలు స్వీకరించిన మాజీ సీఎం కేసీఆర్‌ను హైదరాబాద్‌లోని నందీనగర్‌లో ఎమ్మెల్యేలు పల్లారాజేశ్వర్‌రెడ్డి, సునీతారెడ్డి మాణిక్‌రావు, హరీశ్‌రావు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పెళ్లిసంబంధం కుదుర్చుకోవడానికి వెళ్తూ

కానరాని లోకాలకు

- టైరు పగిలి అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన ట్రాలీ ఆటో
- రోడ్డు ప్రమాదంలో తండ్రి కొడుకుల మృతి
- 11 మందికి గాయాలు
- రామునిపట్ల శివారులోని రాజీవ్‌రహదారిపై ఘటన



సంఘటనా స్థలం వద్ద పోలీసులు



రోధిస్తున్న కుటుంబసభ్యులు



శ్రీనివాస్ (ఫైల్)



హన్మంతరావు (ఫైల్)



సిద్దిపేట ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీలో శ్రీనివాస్, హన్మంతరావు మృతదేహాలు

చిన్నకోదూరు, ఫిబ్రవరి 1 : పెళ్లి సంబంధం మాట్లాడటానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకు అక్కడిక్కడే మృతిచెందారు. మరో 11 మందికి తీవ్ర గాయాలైన సంఘటన సిద్దిపేట జిల్లా చిన్నకోదూరు మండలం రామునిపట్ల గ్రామ శివారులో రాజీవ్‌రహదారిపై గురువారం చోటుచేసుకున్నది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ యాప్రాల్‌లోని బాలాజీనగర్‌కు చెందిన మిరియాల శ్రీనివాస్ (58) స్క్రాప్ (తుక్కు, ఇనుప సామాను) దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి భార్య విజయ, కుమారులు హన్మంతరావు(30), రమేష్, ఓ కుమార్తె ఉన్నారు. గురువారం కుమార్తెకు పెళ్లి సంబంధం మాట్లాడటానికి కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి ట్రాలీ ఆటో(టాటా ఏస్) వాహనంలో హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు బయలుదేరారు. వాహనాన్ని వీరభద్రం నడుపుతుండగా క్యాబిన్‌లో రమేష్ కూర్చున్నాడు. వెనుక ట్రాలీలో శ్రీనివాస్, విజయ, హన్మంతరావు, జ్యోతి, కృషాల్, తేజ, లక్ష్మణ్, సరిత, సాయి, పావని, బాబు ఉన్నారు. సిద్దిపేట జిల్లాలోని చిన్నకోదూరు మండలం రామునిపట్ల గ్రామ శివారులోకి రాగానే అతివేగంగా వెళ్తున్న వాహనం వెనుక టైరు పగిలింది. వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో ట్రాలీ శ్రీనివాస్, అతని కొడుకు హన్మతంరావుపై పడటంతో తలకు, కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న చిన్నకోదూరు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. శ్రీనివాస్, హన్మంతరావు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఓ ప్రైవేట్ వాహనంలో, గాయపడ్డ 11 మందిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ పరిశీలించారు. శ్రీనివాస్ భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల బాధ్యతల స్వీకరణ

8లో..



కొంచెం ఇష్టం కొంచెం కష్టం

కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

మెదక్ అర్బన్/కొండపాక/గజ్వేల్, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వ మధ్యంతర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన వస్తున్నది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గురువారం మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టగా ఆయా వర్గాలు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచాయి. పన్ను చెల్లింపుదారులకు ఎలాంటి ఊరట లభించ లేదని కొందరు పెదవి విరిచారు. ఆదాయపన్ను మినహాయింపు పరిమితి రూ.7 లక్షల వరకు, స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.75 వేలకు పెంచడంతో వేతన జీవులు కొంత ఊరట చెందారు. బీజేపీ నాయకులు ప్రగతిశీల బడ్జెట్‌గా కొనియాడారు. ఆయా వర్గాల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి...

పేదలు, మహిళలు, యువత, రైతులే లక్ష్యంగా బడ్జెట్



ఆరుసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన మొరార్జీ దేశాయ్ రికార్డును నిర్మలాసీతారామన్ సమం చేశారు. మధ్యంతర బడ్జెట్‌లో ప్రధానంగా పేదలు, మహిళలు, రైతులు, యువతను లక్ష్యంగా చేసుకున్నట్లు అర్థమవుతుంది. ఆదాయ పన్ను స్లాబ్‌లలో ఎలాంటి మార్పులు చేయకపోవడంతో రూ.7 లక్షల కన్నా ఎక్కువ ఆదాయం పొందే వేతన జీవులకు నిరాశ మిగిలింది. స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.50 వేల నుంచి రూ.75 వేలకు పెంచడంతో స్వల్ప ఊరట లభించింది. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి కార్పొరేషన్ పన్నును 30శాతం నుంచి 22 శాతానికి తగ్గించడం, టూరిజాన్ని ప్రోత్సహించి ఉద్యోగాలను కల్పించడానికి వడ్డీ లేని రుణాలను అందించడం, రూఫ్ టాప్ సోలార్ విధానం కింద కోటి ఇళ్లకు నెలకు 300 యూనిట్ల విద్యుత్‌ను అందించడం వంటి అంశాలు బాగున్నాయి.

- అమరేందర్‌రెడ్డి,
ప్రభుత్వ జూనియర్ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు, కొండపాక

ఉపాధిహామీకి నిధులు పెంచలేదు



కేంద్ర బడ్జెట్ నిరాశాజనకంగా ఉంది. ఉపాధిహామీకి నిధుల కేటాయింపు పెంచలేదు. నిధుల కొరత వల్ల ఉపాధిహామీపై ఆధారపడిన గ్రామీణుల సంక్షేమాన్ని దెబ్బతీయడమే అవుతుంది. ముఖ్యంగా బడ్జెట్ అంచనా వేసిన సంవత్సరాంతపు బకాయిలను తీసివేసిన తర్వాత 40 రోజుల కంటే తక్కువ పనికి సరిపోతుంది. ఇది కార్మికులను నిరాశకు గురిచేస్తుంది. ప్రత్యేకించి వివిధ సాంకేతిక జోక్యాల కారణంగా గతేడాది కూలీలు ఎదుర్కొన్న సవాళ్లను పరిగణనలోకి తీసుకోలేదు.

- పి.శంకర్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి

పన్ను చెల్లింపుదారులకు ఊరట లభించలేదు



మధ్యంతర బడ్జెట్‌లో పన్ను చెల్లింపుదారులకు ఎలాంటి ఊరట లభించలేదు. పన్నుల విధానంలో ఎలాంటి మార్పులు చేయలేదు. గతంలో ఉన్న పన్ను విధానాన్నే కొనసాగించడం నిరాశను కలిగించింది. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పన, విద్యాభివృద్ధికి బడ్జెట్ కేటాయింపులు పెంచితే బాగుండేది.

-సుంకరి కృష్ణ, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, మెదక్

సత్తా చాటిన అక్కాచెల్లెలు

- నర్సింగ్ ఆఫీసర్లుగా ఉద్యోగాలు సాధించిన లావుడ్య శోభ, రాణి

అక్కన్నపేట, ఫిబ్రవరి 1: గిరిజన కుటుంబానికి చెందిన అక్కాచెల్లెలు నర్సింగ్ ఆఫీసర్లుగా ఉద్యోగాలు సాధించి సత్తాచాటారు. అక్కన్నపేట మండలం కేశనాయక్‌తండాకు చెందిన లావుడ్య జగ్గునాయక్-రాజీ దంపతులకు నలుగురు ఆడపిల్లలు. తండ్రి జగ్గునాయక్ చిన్నప్పుడే చనిపోయారు. తల్లి రాజీ కష్టపడి పిల్లలను చదివించింది. నలుగురిలో లావుడ్య శోభ, లావుడ్య రాణి స్టాఫ్‌నర్స్ సీబీటీ ఎగ్జామ్ రాసి ఉద్యోగం సాధించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో అక్కాచెల్లెలు నియామక పత్రాలను అందుకున్నారు. ఇద్దరు ఒకేసారి ప్రభుత్వఉద్యోగం సాధించడంతో కుటుంబసభ్యుల ఆనందానికి అవధుల్లేవు. పలువురు తండావాసులు ఇరువురిని అభినందించారు.



ఉద్యోగ నియామక పత్రాలను చూపుతున్న అక్కాచెల్లెలు శోభ, రాణి

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు : ఆర్డీవో

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 1 : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. మునిపల్లి మండలం లింగంపల్లిలో గురువారం అక్రమ నిర్మాణాలను తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను కబ్జా చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఆయన వెంట తహసీల్దార్ తెన్‌మొలి, డిప్యూటీ తహసీల్దార్ కృపాదానం, సర్వేయర్ కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్‌లో అక్రమ కట్టడాలను పరిశీలించిన అధికారులు

మనోహరాబాద్, ఫిబ్రవరి 1 : మనోహరాబాద్ శివారులోని రామాయపల్లి చెరువు ఎఫ్‌టీఎల్ భూమిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను గురువారం ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా షెడ్డు నిర్మించిన వారికి నోటీసులు జారీ చేస్తామని నీటి పారుదల శాఖ ఏఈ అనురాధ, డీఈ శ్రీకాంత్ తెలిపారు.


ఊరూరా ఉత్సాహంగా పాతపంటల జాతర



అల్గోల్‌లో డీడీఎస్ మహిళలతో తాజా మాజీ సర్పంచ్ జ్యోతిమోహన్

జహీరాబాద్, ఫిబ్రవరి 1 : డీడీఎస్(డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ) ఆధ్వర్యంలో పాతపంటల జాతర కార్యక్రమం ఊరూరా ఉత్సాహంగా కొనసాగడం సంతోషంగా ఉందని అల్గోల్ సర్పంచ్ జ్యోతిమోహన్ పేర్కొన్నారు. డీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం అల్గోల్ గ్రామంలో పాతపంటల జాతరను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 24 ఏళ్లుగా జహీరాబాద్ నియోజకవర్గంలో డీడీఎస్ ఆధ్వర్యంలో ప్రజలను, రైతులను, అధికారులను ప్రభావితం చేసేదిశగా పాతపంటల జాతర నిర్వహించడం సంతోషకరమన్నారు. డీడీఎస్ సిబ్బంది పాతపంటల జాతర పేరుతో ఎడ్లబండ్లకు చిరుధాన్యాలతో అలంకరించి పాటలు పాడుతూ, కోలాటం ఆడుతూ డప్పుచప్పుళ్లతో వీధుల్లో నృత్యాలు చేస్తూ తిరుగడం ఆకట్టుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీడీఎస్ మహిళా రైతులు, జాతర నిర్వాహకులు వినయ్‌కుమార్, మంజుల, పూలమ్మ, విజయలక్ష్మి, లక్ష్మమ్మ, చంద్రమ్మ, కమలమ్మ, జనరల్ నర్సమ్మ, మొగులమ్మ, బాలయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కర్మకాండకు వెళ్లి.. చెరువులో మునిగి యువకుడి మృతి



బాలేష్ మృతదేహం

తూప్రాన్, ఫిబ్రవరి 1: కుటుంబీకుల్లో ఒకరు మృతిచెందడంతో కర్మకాండ తంతుకు చెరువు వద్ద స్నానాలు చేసేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి యువకుడు మృతిచెందిన సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కిష్టాపూర్‌లో గురువారం చోటుచేసుకున్నది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. తూప్రాన్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన పిట్ల వెంకటయ్య ఇటీవల హల్దీవాగులో పడి మృతిచెందగా గురువారం దశదినకర్మకాండ కార్యక్రమాన్ని గ్రామంలోని నర్సింహుల చెరువు వద్ద నిర్వహించారు. కర్మకాండ తంతులో కుటుంబీకులతో పాటు ఇదే గ్రామానికి చెందిన చిన్నపిట్ల బాలేష్ (34) పాల్గొన్నారు. స్నానం చేసేందుకు చెరువులోకి వెళ్లిన బాలేష్ నీట మునిగిపోయాడు. కుటుంబీకులు అందరూ చూస్తుండగానే చెరువు నీటిలో మునిగి మృతిచెందాడు. గాలింపు చర్యలు చేపట్టి బాలేష్ మృతదేహాన్ని బయటకు తీశారు. బాలేష్ భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదగిరి తెలిపారు.

కార్మిక హక్కులు కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

● ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి



మాట్లాడుతున్న సంజీవరెడ్డి

పటాన్‌చెరు, ఫిబ్రవరి 1 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ సంజీవరెడ్డి అన్నారు. పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని ఏషియన్ పెయింట్స్ పరిశ్రమలో రేపు జరిగే కార్మిక సంఘం ఎన్నికల సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన ఐఎన్‌టీయూసీ గేట్ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మిక చట్టాలకు సంస్కరణల పేరుతో యాజమాన్యాలకు మేలు జరిగేలా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ వైఖరితో దేశ వ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ వర్గాలు తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. హక్కులను కాపాడుకునేందుకు కార్మిక సంఘాలన్నీ ఏకతాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఏషియన్ పెయింట్స్ కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని ఘనమైన మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. గతంలో అనేక మాయమాటలు, ఆచరణ సాధ్యం కానీ హామీలతో ఎన్నికైన సంఘాలు యాజమాన్యాలకు వత్తాసు పలికి కార్మికులకు తీరని అన్యాయం చేశారని గుర్తుచేశారు. కార్మిక పక్షపతిగా వ్యవహరించే ఐఎన్‌టీయూసీ హక్కుల సాధనలో రాజీపడే ప్రసక్తే ఉండదన్నారు. సమావేశంలో హెచ్ఎంఎస్ జాతీయ నాయకుడు సుదర్శన్, ఐఎన్‌టీయూసీ జాతీయ యువత కన్వీనర్ సత్యజిత్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లూరి నర్సింహారెడ్డి, యూనియన్ ఉపాధ్యక్షుడు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల బాధ్యతల స్వీకరణ

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 1: హుస్నాబాద్ మండలంలోని 17 గ్రామపంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. హుస్నాబాద్ మండలం పొట్లపల్లి, నాగారం గ్రామపంచాయతీకి హుస్నాబాద్ ఎంపీడీవో ఎం.రాఘవేందర్‌రెడ్డిని, పోతారం(ఎస్)కు ఐబీ డిప్యూటీ ఈఈ కరుణశ్రీ, పందిల్లకు తహసీల్దార్ జీ.రవీందర్‌రెడ్డి, మహ్మదాపూర్‌కు ఎంపీవో సత్యనారాయణ, గాంధీనగర్‌కు ఎంఏవో (అగ్రికల్చర్) ఎం.నాగరాజు, మీర్జాపూర్‌కు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.కవిత, జిల్లెలగడ్డకు ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ ఎం.మమత, వంగరామయ్యపల్లికి ఐబీ ఏఈ అమృతయ్య, కూచనపల్లికి ఏఎస్‌వో ఏ.శ్రీనివాస్, బల్లునాయక్‌తండాకు నందా, మడదకు వై.యశ్వంత్, నాగారంకు ఆర్‌ఐ పీ.రాజయ్య, తోటపల్లికి వై.దేవేంద్ర, బంజేరుపల్లికి ఏఈపీ అనన్య, మాలపల్లికి పీఆర్ ఏఈ స్నేహ, రాములపల్లికి ఏఈ రవికుమార్, ఉమ్మాపూర్‌కు ఎంపీవో సత్యనారాయణను నియమించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

●**రాయపోల్:** రాయపోల్, దౌల్తాబాద్ మండల పరిధిలోని గ్రామపంచాయతీల్లో ప్రత్యేకాధికారులు గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. రాయపోల్, తిమ్మక్కపల్లికి ఏపీడీ బాల్‌రాజు, అనాజీపూర్, చిన్నమాసాన్‌పల్లి, కొత్తపల్లి, మంతూరులకు ఎంపీడీవో మునెయ్య, వడ్డేపల్లి, అంకిరెడ్డిపల్లి, వీరారెడ్డిపల్లికి తహసీల్దార్ దివ్య, ఎల్కల్, రామారం, గొల్లపల్లి, సయ్యద్‌నగర్‌కు ఎంపీవో లక్ష్మీనారాయణ, దౌల్తాబాద్ మత్స్యశాఖ ఏడీ మల్లేశం, దొమ్మాట, నర్సంపల్లికి ఎంపీడీవో రాజేశ్, మహ్మద్‌షాపూర్, తిర్మలాపూర్‌కు తహసీల్దార్ సుజాత, సూరంపల్లి, గాజులపల్లి, హైమద్‌నగర్‌కు ఎంపీవో గఫూర్, ముబారస్‌పూర్, మల్లేశంపల్లికి ఎంఏవో గోవిందరాజు బాధ్యతలు స్వీకరించారు.

●**గజ్వేల్:** గజ్వేల్ మండలంలోని కొడకండ్ల, బూర్గుపల్లి, ఆరేపల్లి(ఎస్‌బీ)కి ఎంపీడీవో మచ్చేందర్, అహ్మదీపూర్, శేరుపల్లికి తహసీల్దార్ బాల్‌రాజు, గిరిపల్లి, రంగంపేట, ర్యాగట్లపల్లికి ఎంపీవో దయాకర్, ధర్మారెడ్డిపల్లికి పీఆర్ డీఈఈ అజయ్‌కుమార్, కొల్గూరుకు డీఈ ఆర్‌డబ్ల్యూఎస్ సుమలత, పిడిచెడ్‌కు సీడీపీవో వెంకట్రాజమ్మ, సింగాటం, అనంతరావుపల్లికి నాయబ్ తహసీల్దార్ భార్గవ్‌సాగర్, శ్రీగిరిపల్లి, అక్కారం నాయబ్ తహసీల్దార్ భాస్కర్, రిమ్మనగూడ, దాతర్‌పల్లికి ఏంఎవో గుండు నాగరాజు, దిలాల్‌పూర్‌కు పీఆర్ ఏఈ నాగేంద్ర, బెజుగామకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, దాచారంకు ఆర్‌అండ్‌బీ ఏఈ ధన్‌రాజ్, ముక్తమాసాన్‌పల్లి, బంగ్లావెంకటాపూర్‌కి ఎంపీడీవో జయపాల్‌రెడ్డి, జాలిగామకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని, బయ్యారంకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య, కోమటిబండకు మిషన్ భగీరథ డీఈఈ నాగార్జున బాధ్యతలు స్వీకరించారు.

●**చేర్యాల:** కొమురవెల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో అనురాధ (కొమురవెల్లి, పోసాన్‌పల్లి), తహసీల్దార్ లక్ష్మీనారాయణ (ఐనాపూర్, తపాస్‌పల్లి), సూపరింటెండెంట్ వకుళాభరణం రాంప్రసాద్ (రసూలాబాద్), ఎంపీవో మంజుల (గురువన్నపేట, లెనిన్‌నగర్), వ్యవసాయాధికారి నరేశ్ (గౌరాయపల్లి, రాంసాగర్), డీటీ వేణుగోపాల్ (కిష్టంపేట), సీడీ పీవో శారద (మర్రిముచ్చాల) విధుల్లో చేరారు.

●**ములుగు:** ములుగు, నాగిరెడ్డిపల్లి, లక్ష్మక్కపల్లిలకు ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, తునికి బొల్లారం, మామిడ్యాల, బైలంపూర్‌లకు తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి,



హుస్నాబాద్ రూరల్: నాగారంలో గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవో రాఘవేందర్‌రెడ్డి

అచ్చాయపల్లి, వాగునూతిలకు ఐసీడీఎస్ అధికారి మోహితాబేగం, దాసర్లపల్లి, బస్వాపూర్‌లకు వ్యవసాయశాఖ ఏడీ అనిల్‌కుమార్, చిల్లసాగర్, గంగాధర్‌పల్లిలకు ఎంఈవో ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, చిన్నతిమ్మాపూర్, జప్తి సింగాయపల్లి, అన్నసాగర్‌లకు అటవీ అధికారి కిరణ్‌కుమార్, కొత్తూరు, బండమైలారం, బండ తిమ్మాపూర్‌కు ఎంపీవో నర్సింహారావు, కొక్కొండ, సింగన్నగూడ ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ రాంచందర్‌రావు, నర్సాపూర్, శ్రీరాంపూర్‌లకు డిప్యూటీ తహసీల్దార్ భవానీ, కొట్యాల్, అలీనగర్‌లకు పీఆర్ ఏఈ చక్రధర్, అలియాబాద్, నర్సంపల్లి వ్యవసాయ అధికారి ప్రగతిని నియమించారు.

●**మద్దూరు:** మద్దూరు, సలాఖ్‌పూర్, ధర్మారంకు ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్, గాగిళ్లాపూర్, నర్సాయపల్లికి ఏడీఏ రాధిక, లద్నూరు, మర్మాములకు తహసీల్దార్



రాయపోల్: రాయపోల్ మండలం వడ్డేపల్లిలో బాధ్యతలను స్వీకరిస్తున్న ప్రత్యేకాధికారి తహసీల్దార్ దివ్య

అనంతరెడ్డి, రేబర్తి, వల్లంపట్లకు డీటీ గోపాల్, వంగపల్లికి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, అర్జున్‌పట్ల, కమలాయపల్లికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత, దూళిమిట్ట, భైరాన్‌పల్లికి తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, బెక్కల్, తోర్నాల, రెడ్యానాయక్‌తండాకు ఎంపీవో ఖాజామొయినుద్దీన్, కూటిగల్, కొండాపూర్‌కు ఏవో బూరెల రామకృష్ణ, హన్మతండా, దుబ్బతండా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఈ.లక్ష్మి, జాలపల్లి, లింగాపూర్‌కు పీఆర్ ఏఈ వినయ్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు.

●**జగదేవ్‌పూర్:** సర్పంచుల పదవీకాలం ముగియడంతో గురువారం సాయంత్రం జగదేవ్‌పూర్ మండలంలోని 29 గ్రామాల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు తీసుకున్నారు. రెండు, మూడు గ్రామాలను కలుపుతూ క్లస్టర్లుగా విభజించి ఒక్కో క్లస్టర్‌కు ఒకరిని ప్రత్యేక అధికారిగా నియమించారు.

అధ్వానంగా మధ్యాహ్న భోజనం

- వారంలో ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే గుడ్డు
- ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకుంటున్న విద్యార్థులు
- కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలలో ఇదీ తీరు



ఇంటి నుంచి తెచ్చుకున్న బాక్సుల భోజనం చేస్తున్న విద్యార్థులు

కొండపాక, ఫిబ్రవరి 1: సంపూర్ణ పోషకాహారం అందించాలని ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్నభోజనం పలు పాఠశాలలో అధ్వానంగా నిర్వహిస్తున్నారు. కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. పాఠశాలలో 390 మంది విద్యార్థులు ఉండగా 50 నుంచి 60 మంది విద్యార్థులు ఇంటి నుంచే బాక్సులు తెచ్చుకొని తింటున్నారు. పాఠశాలలో తినే విద్యార్థులు సరిగా లేని రోజు అన్నం పడేస్తున్నారు. మెనూ ప్రకారం వారంలో మూడు రోజులు గుడ్డు పెట్టాల్సి ఉండగా ఒకటి లేదా రెండు రోజులు మాత్రమే పెడుతున్నారని విద్యార్థులు తెలిపారు. భోజనంలో కూరలు, చారు సరిగా ఉండవని పేర్కొన్నారు. ఆరునెలల నుంచి బిల్లులు సరిగ్గా రావడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. ప్రధానోపాధ్యాయుడు సత్తయ్యను వివరణ కోరగా అలాంటిదేమీ లేదని, మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం నిర్వహిస్తున్నట్టు తెలిపాడు. కొంతమంది విద్యార్థులు ఆహారం పడకపోవడంతో ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకుంటున్న విషయం నిజమేనని తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడ్డ ప్రశాంత్

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 1: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని కోమటిబండ గ్రామానికి చెందిన ఎస్.ప్రశాంత్ ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం గజ్వేల్‌లోని లక్ష్మణ్ గార్డెన్ సమీపంలో ఉన్న పెట్రోల్ బంకులో బైక్‌లో పెట్రోల్ పోసుకుని బయటకు వస్తున్నాడు. ఈ క్రమంలో తూప్రాన్ వైపు వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ప్రశాంత్ తలకు తీవ్రగాయాలై స్పృహ కోల్పోయాడు. స్థానికులు వెంటనే గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాగునీటి కోసం ధర్మారం రైతుల ధర్నా



కాలువలో ధర్నా నిర్వహిస్తున్న రైతులు

మద్దూరు, ఫిబ్రవరి 1: కాలువ ద్వారా సాగునీరును అందించాలని కోరుతూ మద్దూరు మండలంలోని ధర్మారం గ్రామ రైతులు పొన్నబోయిన యాదయ్య, పల్లపు వెంకటయ్య, పల్లపు అఖిల్, గొంగురం శేఖర్‌రెడ్డి, పిట్టల ఇస్తారి, గుడిసె కిష్టయ్య ఎండిపోయిన కాలువలో కూర్చొని గురువారం ధర్నా నిర్వహించారు. కాలువ నీళ్లు వస్తాయన్న ఆశతో సుమారు 20 మంది రైతులం కలిసి 200 ఎకరాలలో వరిసాగు చేపట్టామన్నారు. లద్నూరు రిజర్వాయర్‌లోకి నీళ్లు వదలడం ద్వారా చెరువుల్లోకి నీళ్లు మళ్లించే క్రమంలో కాలువల ద్వారా పారే నీళ్లు తమ పంట పొలాలకు కాపాడుతాయని భావించామన్నారు. రిజర్వాయర్‌లోకి నీళ్లు వదలకపోవడంతో పంటపొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సాగునీళ్లు అందించాలని కోరారు.

మర్పడగ పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక, ఫిబ్రవరి 1: కొండపాక మండలం మర్పడగ ఉన్నత పాఠశాలను సిద్దిపేట డీఈవో శ్రీనివాస్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను, రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. అయోధ్యలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ రోజు గ్రామంలో జరిగిన ఉత్సవాల్లో విద్యార్థులు పాల్గొన్నారని విద్యార్థి సంఘాల ఫిర్యాదు చేయడంతో డీఈవో విచారణ జరిపారు.

పరిజ్ఞానంతో పనిచేస్తే ఏ రంగంలోనైనా రాణించవచ్చు

గజ్వేల్, ఫిబ్రవరి 1: పూర్తి పరిజ్ఞానంతో పనిచేస్తే ఏ రంగంలోనైనా రాణించవచ్చని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ ప్రొఫెసర్ ఉజ్జల్ ముఖర్జీ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ఏర్పాటుచేసిన 'ఉద్యోగ అవకాశాలు-వ్యక్తిత్వ వికాసం' అనే అంశంపై ఆయన మాట్లాడారు. ప్రతిభకు, నైపుణ్యానికి తేడాను వివరించారు. వారితో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఉమాశశి, వైస్ ప్రిన్సిపల్, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ ఉమారాణి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సౌజన్య, అధ్యాపకులు

పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలి: అక్షయ్‌కుమార్

గజ్వేల్, ఫిబ్రవరి 1: గజ్వేల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని పాలిటెక్నిక్ విద్యార్థుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మేకల అక్షయ్ కుమార్ డిమాండ్ చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని సంగాపూర్‌లో గల పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో కలిసి ఆయన మాట్లాడారు. 1988లో ఏర్పడిన 35 ఏళ్ల కళాశాల ఎంతోమందిని ఇంజనీర్లుగా తీర్చిదిద్దిందన్నారు. రాష్ట్రంలోనే ఏకైక ఎస్సీ బాలుర ప్రభుత్వ మోడల్ పాలిటెక్నిక్ కళాశాల అయిన గజ్వేల్ పాలిటెక్నిక్‌ను ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.

సీసీ కెమెరాలతో భద్రత: చేర్యాల సీఐ

చేర్యాల/మద్దూరు, ఫిబ్రవరి 1: సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రతకు భరోసా కలుగుతుందని చేర్యాల సీఐ ఎల్.శ్రీనివాస్ అన్నారు. చేర్యాల మండలం ఆకునూరు గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసు సిబ్బందితో సమానమని, ఎన్నో నేరాల ఛేదనలో సీసీటీవీ ఫుటేజీలు ఆధారంగా నిలిచాయన్నారు. చేర్యాల సర్కిల్ పరిధిలో గంజాయి విక్రయాలపై పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయనవెంట చేర్యాల ఎస్ఐ.దామోదర్ తదితరులు పాల్గొన్నారు. మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్‌లో గ్రామస్థులకు సీసీ కెమెరాల ప్రయోజనాలు, సైబర్ నేరాలపై ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో చేర్యాల సీఐ శ్రీను పాల్గొని మాట్లాడారు. ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ పాల్గొన్నారు.

'రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం'

మిరుదొడ్డి, ఫిబ్రవరి 1: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నదని బీఆర్‌ఎస్ అక్బర్‌పేట-భూంపల్లి మండలాధ్యక్షుడు జీడిపల్లి రవి మండిపడ్డారు. గురువారం మండల కేంద్రమైన అక్బర్‌పేట-భూంపల్లి చౌరస్తాలో కూడవెల్లి వాగులోకి నీటి విడుదల చేయాలంటూ రైతులు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి రాస్తారోకో నిర్వహించి మాట్లాడారు. కూడవెల్లి వాగులోకి మల్లన్నసాగర్ నీటిని విడుదల చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని బీఆర్‌ఎస్ నాయకులకు సముదాయించి రాస్తారోకోను విరమింపజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కైలాస్, శ్రీనివాస్, సురేశ్, కిషన్, సురేష్, శ్రీనివాస్‌గౌడ్, బుచ్చయ్య, ప్రభాకర్, కృష్ణ పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి: శ్యాంసుందర్‌రావు

మద్దూరు, ఫిబ్రవరి 1: బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పాలకులు అభివృద్ధిని విస్మరించారని బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ కార్యవర్గ సభ్యుడు వీవీ.శ్యాంసుందర్‌రావు తెలిపారు. గురువారం దూళిమిట్ట మండలంలోని బెక్కల్ గ్రామంలో రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, విలేకరులతో మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 400 పైచిలుకు సీట్లు సాధించడంతో పాటు, భువనగిరి పార్లమెంట్‌లో విజయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు, మండల ఇన్‌చార్జి అంకుగారి శశిధర్‌రెడ్డి, కప్పల ప్రసాద్, ధనుంజయ, భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ రవీందర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మల్లేశం, మండలాధ్యక్షుడు ధరావత్ భిక్షపతినాయక్, భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉదయ్‌రెడ్డి, చర్ల సంతోష్, లక్ష్మణ్‌నాయక్, మైపాల్‌గౌడ్, యాదగిరి పాల్గొన్నారు.

'వరిసాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి'

చిన్నకోడూరు: వరి సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే, అధిక దిగుబడి పొందే అవకాశం ఉన్నదని తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శ్వేత అన్నారు. మండలంలోని కస్తూరిపల్లి, ఇబ్రహీంనగర్, విఠలాపూర్ గ్రామాల్లో గురువారం ఏవో జయంత్ కుమార్‌తో కలిసి పంటలను పరిశీలించి, రైతులకు సూచనలు చేశారు.

'చీడపీడల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి'

నంగునూరు: ప్రస్తుత యాసంగిలో వరికి సోకే చీడపీడల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని తోర్నాల వ్యవసాయ క్షేత్ర శాస్త్రవేత్త డాక్టర్ రమాదేవి అన్నారు. నంగునూరు మండలం వెంకటాపూర్, కోనాయిపల్లి, తిమ్మాయిపల్లి, నర్మెట్ట, మైసంపల్లి గ్రామాల్లోని పంట పొలాలను వ్యవసాయశాఖ, తోర్నాల పరిశోధన స్థానం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో పరిశీలించారు.

'విద్యార్థులు కష్టపడి చదవాలి'

మిరుదొడ్డి: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గురువారం అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని భూంపల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులకు సొంతఖర్చులతో మైక్‌సెట్‌ను అందించారు.

రైతుల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

కొండపాక: రైతులు సంఘటితమై పోరాటం చేస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని భారతీయ కిసాన్ సంఘ్ సంఘటన మంత్రి రాము పేర్కొన్నాడు. కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి, బందారం గ్రామాల్లో భారతీయ కిసాన్ సంఘ్ రైతుల సభ్యత్వ నమోదు ప్రారంభించారు.

వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం

వర్గల్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన వర్గల్‌తో పాటు మల్లారెడ్డిపల్లి గ్రామాల్లో గురువారం వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వర్గల్ మండల కేంద్రంలో 81 మందికి, మల్లారెడ్డిపల్లిలో 32 మంది వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

'కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

దుబ్బాక: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేష్‌గౌడ్ అన్నారు. గురువారం దుబ్బాకలోని వర్తక సంఘంలో గావ్ చలో- బస్తీ చలో కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆదేశాల మేరకు నిర్వహించారు.

ప్రమాదాలు లేని డిపోగా పేరు తీసుకురావాలి: ఎంవీఐ

హుస్నాబాద్: ప్రయాణీకులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతూ ప్రమాదాలు లేని ఆర్టీసీ డిపోగా హుస్నాబాద్‌కు పేరు తీసుకురావాలని ఎంవీఐ టీ.జనార్ధన్‌రెడ్డి డ్రైవర్లకు సూచించారు. గురువారం హుస్నాబాద్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవాల్లో భాగంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

డిపాజిట్ డబ్బులను చెల్లించాలి

కోహెడ: మండలంలోని సహారా బాధితుల డిపాజిట్ గడువు ముగిసినా డబ్బులు చెల్లించడం లేదని కార్యాలయం ఎదుట బాధితులు గురువారం ధర్నా చేశారు. నాలుగేళ్ల నుంచి డబ్బులు ఇవ్వమని అడగ్గా.. మోసపూరిత మాటలు చెబుతూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. బాధితులు వీరబత్తిని రమేష్, యాదగిరి, రేపోజు కనకయ్య, డాబులు, సంజీవ్, హసిరెడ్డి ధర్మయ్య, మల్లికార్జున్ పాల్గొన్నారు.

గరంగరంగా మండల సర్వసభ్య సమావేశం

- అధికారుల తీరుపై సర్పంచులు, ఎంపీటీసీల మండిపాటు



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ

మద్దూరు, ఫిబ్రవరి 1: మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం గరంగరంగా కొనసాగింది. జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రైతులు సాగు చేసిన పంటలకు సోకిన మొగిపురుగు ఉధృతికి వ్యవసాయాధికారులు ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలు గురించి తెలపకపోవడంతో పాటు రైతులకు సరిపడా ఎరువులు వచ్చాయా లేవా అని పర్యవేక్షణ చేయకపోవడంపై సర్పంచులు మండిపడ్డారు. రేబర్తిలో సొసైటీ ఉన్నా మద్దూరు క్యాష్ కౌంటర్‌లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజాప్రతినిధులను ఆహ్వానించకపోవడంపై ఎంపీటీసీ కూరెల్ల రాజుతో పాటు సర్పంచులు బాల్‌రాజ్, శ్రీనివాస్ చైర్మన్ తీరుపై మండిపడ్డారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక గ్రామీణుల జీవన ప్రమాణాలు పెరిగాయన్నారు. మద్దూరు మండలం సిద్దిపేటలో కలవడంతో కొంతవరకు అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. స్పెషలాఫీసర్ల పాలనలో సర్పంచులు చేపట్టిన పనులకు బిల్లులు వచ్చేవిధంగా చూడాలని జడ్పీ చైర్‌పర్సన్‌కు సర్పంచులు విజ్ఞప్తి చేశారు. అనంతరం సర్పంచులకు జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్లు అనంతరెడ్డి, సొసైటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, వివిధశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం ఉధృతం చేస్తాం

- ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్‌మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ మాదిగ

తొగుట, ఫిబ్రవరి 1: ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం ఉధృతం చేస్తామని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్‌మాదిగ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రమైన తొగుటలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ మండల కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం హామీఇచ్చిన మేరకు ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే వచ్చే ఎన్నికల్లో మాదిగలకు ఇచ్చిన హామీలను మరిచిన పార్టీలకు తమ సత్తా చూపిస్తామని స్పష్టం చేశారు.ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఫిబ్రవరి చివరి వారంలో హలో మాదిగ-చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం తొగుట మండల కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రాజమల్లయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకట్, జిల్లా అధ్యక్షుడు లింగాల కృష్ణ, ఉపాధ్యక్షుడు సాయిలు, జిల్లా కార్యదర్శి నర్సింహులు, తొగుట మండల అధ్యక్షుడు రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకే పోటీ పరీక్షలు

- పలు మండలాల్లో ఘనంగా సాంఘికశాస్త్ర ప్రతిభ పరీక్ష



సాంఘికశాస్త్ర పరీక్షా పత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు నాగరాజు

నారాయణరావుపేట/చిన్నకోడూరు/కొండపాక/నంగునూరు/సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 1: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితిసేందుకు పోటీ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని నారాయణరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వడ్డెపల్లి నాగరాజు అన్నారు. గురువారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మండలస్థాయి సాంఘికశాస్త్రం ప్రతిభా పాటవ పరీక్ష నిర్వహించారు. ఇందులో మొదటిస్థానంలో కే.లిహారిక (జడ్పీహెచ్‌ఎస్, నారాయణరావుపేట), ద్వితీయ స్థానంలో వైష్ణవి (జడ్పీహెచ్‌ఎస్, జక్కాపూర్) నిలిచి జిల్లాస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఫిబ్రవరి 3న సిద్దిపేటలోని ఇంద్రానగర్ హైస్కూల్‌లో నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో ఇద్దరూ పాల్గొంటారని పేర్కొన్నారు. చిన్నకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం మండలస్థాయి సాంఘికశాస్త్ర ప్రతిభా పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షలో తెలుగు మీడియం నుంచి వీ.శైలజ, ఎం.విక్కీ (జడ్పీహెచ్‌ఎస్, అనంతసాగర్), ఇంగ్లీష్ మీడియం నుంచి ఎన్. బాలకృష్ణ (జడ్పీహెచ్‌ఎస్, పెద్దకోడూరు), పీ.మహీధర్ (జడ్పీహెచ్‌ఎస్, అల్లీపూర్) ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మండలస్థాయి సాంఘికశాస్త్ర ప్రతిభా పరీక్షలో కుకునూరుపల్లి మండలంలోని పలు గ్రామాల విద్యార్థులు పాల్గొన్నారు. చిన్న కిష్టాపూర్ పాఠశాల విద్యార్థులకు ప్రథమ, కుకునూరుపల్లి పాఠశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి పొందారు. సోషల్ స్టడీస్ ఫోరం ఆధ్వర్యంలో సోషల్ టాలెంట్ టెస్ట్‌లో నంగునూరు మండలం అక్కెనపల్లి మోడల్ స్కూల్ విద్యార్థిని పీ.అలేఖ్య జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రవీందర్‌గౌడ్ తెలిపారు. ఇంగ్లీషు మీడియంలో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. సిద్దిపేట రూరల్ మండలం సోషల్ స్టడీస్ ఫోరం ఆధ్వర్యంలో గురువారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండలంలోని 8 ఉన్నత పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులు హాజరయ్యారు. ఇంగ్లీషు మీడియంలో అశ్విని(మోడల్ స్కూల్), వెన్నెల వైష్ణవి (కేజీబీవీ రాఘవపూర్), అంకిత (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్న గుండవెల్లి), తెలుగు మీడియంలో పి.లోహిత, వి.వంశీలు (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చింతమడక) విద్యార్థులు ఎంపికయ్యారు. వీరందరూ జిల్లాస్థాయిలో జరిగే పోటీ పరీక్షలో పాల్గొననున్నారు.

త్వరితగతిన పెండింగ్ బిల్లులను చెల్లించాలి

- మండల సభలో సర్పంచుల వేడుకోలు

చేర్యాల, ఫిబ్రవరి 1: గ్రామాల అభివృద్ధి పేరిట అప్పులు చేసి చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను త్వరితగతిన చెల్లించి ఇబ్బందులు తీర్చాలని చేర్యాల మండల సర్పంచులు వేడుకున్నారు. గురువారం చేర్యాల ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్ అధ్యక్షతన స్థానిక వీరభద్ర గార్డెన్స్‌లో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ తొలిసారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ శాఖల వారీగా సమీక్ష చేపట్టారు. అనంతరం పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో గ్రామాల్లో చేపట్టిన పనుల బిల్లులు రాకపోవడంతో తంటాలు పడుతున్నామని సర్పంచులు వాపోయారు. సర్పంచులను జడ్పీ చైర్‌పర్సన్ సత్కరించారు. మార్కెట్ చైర్మన్ సుంకరి మల్లేశం, ఎంపీడీవో మహబూబ్‌అలీ, పీఏసీఎస్ చైర్మన్ వంగ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●**గజ్వేల్:** గజ్వేల్ పట్టణంలోని ఐవోసీ కార్యాలయంలో గజ్వేల్ ఎంపీపీ దాసరి అమరావతి ఆధ్వర్యంలో సర్పంచ్, ఉపసర్పంచులకు ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సర్పంచులను సన్మానించారు.

●**మద్దూరు:** మద్దూరు మండలం ధర్మారంలోని పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గసభ్యులకు గ్రామస్థులు గురువారం శాలువాతో సన్మానించారు. వార్డుసభ్యులు, పంచాయతీ సెక్రటరీ అశోక్ పాల్గొన్నారు.

●**అక్కన్నపేట:** అక్కన్నపేట మండల కేంద్రంలో గ్రామపంచాయతీ పాలకవర్గసభ్యులకు సన్మానం నిర్వహించారు. అనంతరం సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులకు సన్మానం చేశారు.

●**నారాయణరావుపేట:** నారాయణరావుపేట మండల జక్కాపూర్‌తో పాటు గోపులాపూర్, గుర్రాలగొంది గ్రామాల్లో గ్రామపంచాయతీ తాజా, మాజీ పాలకవర్గం సభ్యులను, సిబ్బందిని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పార్శంది పెద్దన్నశర్మ, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ, ఎంపీటీసీలు ఆకుల హరీశ్, భానుచందర్, తాజా, మాజీ సర్పంచులు ఉన్నారు.



గజ్వేల్ పట్టణంలో సర్పంచుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

●**మిరుదొడ్డి:** గ్రామాల్లో సర్పంచుల సేవలు మరువలేనివని ఎంపీపీ సాయిలు అన్నారు. మిరుదొడ్డి ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచుల పదవీకాలం ముగియడంతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం సర్పంచులను శాలువాతో సన్మానించారు.

●**కోహెడ:** కోహెడ మండల కేంద్రంలోని వెంకటేశ్వర గార్డెన్స్‌లో గురువారం సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు పేర్యాల నవ్య దేవేందర్‌రావు ఆధ్వర్యంలో 27గ్రామాల సర్పంచులను ఘనంగా సన్మానించారు. ఇందులో వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు



కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్/బెజ్జంకి, ఫిబ్రవరి 1: గజ్వేల్ శాసనసభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం బీఆర్‌ఎస్‌ఎల్పీ నేతగా బాధ్యతలు స్వీకరించిన మాజీ సీఎం కేసీఆర్‌ను ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళిలు గురువారం అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ అసెంబ్లీలో గురువారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అసెంబ్లీలోని ఎల్పీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆరు గ్యారంటీ పథకాల అమలే లక్ష్యం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

వర్గల్, ఫిబ్రవరి 1: ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల అమలే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకెళ్తున్నదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గురువారం వర్గల్ మండలం తునికిఖాల్సా గ్రామంలో మాజీ ఎంపీపీ విద్యాకుమార్, మాజీ సర్పంచ్ కొండల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ఎంపీటీసీ గోడుగు జనార్ధన్, వార్డుమెంబర్లు, కార్యకర్తలు నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా.. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు అంక్షారెడ్డి, నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, పార్టీ మండలాధ్యక్షుడు సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగురోజుల పాటు పత్తి కొనుగోళ్ల నిలిపివేత

గజ్వేల్, ఫిబ్రవరి 1: ఈ నెల 2 నుంచి 5వ తేదీవరకు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని పత్తి మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను నిలిపివేయనున్నట్లు గజ్వేల్ ఏఎంసీ కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పత్తి మిల్లులలో పత్తి, పత్తి గింజల నిలువలు పెరిగిపోయిన కారణంగా సీసీఐ అధికారులు పత్తిని కొనుగోలు చేయబోమని తెలిపారు. రైతులు ఇందుకు సహకరించాలని, 2, 3, 4, 5 తేదీల్లో పత్తిని తీసుకురావొద్దని తెలిపారు. తిరిగి ఫిబ్రవరి 6న పత్తి కొనుగోళ్లు యధావిధిగా ప్రారంభమవుతాయని తెలిపారు.

నేడు, రేపు పత్తి కొనుగోళ్ల నిలిపివేత

హుస్నాబాద్, ఫిబ్రవరి 1: హుస్నాబాద్‌లోని మిల్లుల్లో స్టాక్ ఎక్కువ ఉండటంతో శుక్ర, శనివారాలో సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేసినట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి సుజన్‌బాబు తెలిపారు. రైతులు గమనించి మిల్లులకు పత్తి తీసుకురావద్దని కోరారు. సోమవారం నుంచి కొనుగోళ్లు యధావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

డిజిటల్ కీలను స్వాధీనం చేసుకున్న అధికారులు

అక్కన్నపేట, ఫిబ్రవరి 1: అక్కన్నపేట మండలంలోని 32 గ్రామపంచాయతీల్లో సర్పంచుల వద్ద ఉన్న డిజిటల్ కీలను పంచాయతీ కార్యదర్శులు తీసుకుని గురువారం ఎంపీడీవో కొప్పుల సత్యపాల్‌రెడ్డి, ఎంపీవో కవి కుమారులకు అప్పగించారు. ఈ డిజిటల్ కీలను జిల్లా పంచాయతీ అధికారికి అప్పగిస్తామని ఎంపీడీవో తెలిపారు.